సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

మొద్దునిద్రలో నిఘా నేత్రం

- కీలక కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు
- మరమ్మతులు చేయించని అధికారులు
- కేసుల దర్యాప్తులో పోలీసులకు చుక్కెదురు



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో సీసీ కెమెరాలు



బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద సీసీ కెమెరాలు



పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు వద్ద సీసీ కెమెరా



జాతీయ రహదారిపై సత్యం జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు

సీతమ్మధార : ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని చెప్పే ఉన్నతాధికారులు... వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు. కీలకమైన కూడళ్లలో నిఘా నేత్రాలు మొద్దు నిద్దరోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో చాలా చోట్ల ఏళ్ల తరబడి పనిచేయకున్నా మరమ్మతులు చేయించడం లేదంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ద్వారకా, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక బాధపడుతుండగా, ఉన్నచోట పనిచేయకపోయినా పట్టించుకోకపోవడం గమనార్హం. విశాఖపట్నంలో వేలాది సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సాక్షాత్తూ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే.

ఓ వైపు అవగాహన కల్పిస్తూ...

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ముఖ్యమైన జంక్షన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు, ప్రమాదాల సమయంలో ఉపయోగకరంగా ఉంటాయని చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్న శ్రద్ధ కెమెరాల నిర్వహణలో లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో కీలకమైన సత్యం జంక్షన్‌లో పది కెమెరాలున్నా వాటిలో చాలా వరకు పనిచేయడం లేదు. మద్దిలపాలెం, సీతమ్మధార, సత్యం జంక్షన్, బాలయ్యశాస్త్రి లే అవుట్, గురుద్వారా, సీతంపేట, ద్వారకానగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, డైమండ్‌పార్కు, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లోనూ చాలా కెమెరాలు పనిచేయడం లేదు. జీవీఎంసీ, ఎల్ అండ్ టీ, పోలీసు శాఖ, మేట్రిక్స్ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ అండ్‌టీకి జీవీఎంసీ, మేట్రిక్స్‌కి పోలీసు శాఖ నిధులు చెల్లించాల్సి ఉంది.

కేసుల దర్యాప్తులో ఇబ్బందులు

చోరీలు, రోడ్డు ప్రమాదాల సమయంలో పోలీసుల కేసు దర్యాప్తులో సీసీ కెమెరాల పుటేజీ కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటిది కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పలు కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. ఆయా కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు పనిచేయక పోలీసులకు చుక్కెదురవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక్కోసారి ప్రమాదం, చోరీ జరిగిన ప్రాంతానికి ఆధారాల కోసం పోలీసులు వెళ్లి సీసీ కెమెరా పుటేజీ చూద్దామంటే కనిపించకపోవంతో అవాక్కవుతున్నారు. ఇటీవల సీతంపేటలో ఒక కేసు విషయంలో పోలీసులు విచారణ సందర్భంగా స్థానిక దుర్గా గణపతి దేవస్థానం ఎదురుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసి కంగుతిన్నారు. వార్షిక నిర్వహణ కాంట్రాక్టు (ఏఎంసీ) నిధులు కూడా ఇవ్వకపోవడం వల్లనే సీసీ కెమెరాలకు సంబంధిత సంస్థలు మరమ్మతులు చేయించడం లేదని తెలుస్తోంది. ఈ విషయమై కంట్రోల్ రూమ్ సీఐ హుస్సేన్‌ని 'సాక్షి' వివరణ కోరగా కొన్ని చోట్ల వైర్లు తెగిపోవడం వల్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. మరమ్మతులు ప్రారంభించామన్నారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో కొన్నిచోట్ల వైర్లు, తెగిపోవడంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్రస్తుతం బీచ్‌రోడ్డు ప్రాంతంలో మరమ్మతులు చేస్తున్నామని, మిగిలిన చోట్ల కూడా మరమ్మతులు పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

సామాజిక సేవా కార్యక్రమాల విస్తృతికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఆయన అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ వాకర్స్ క్లబ్‌కు ప్రత్యేక నిబంధనావళి రూపొందించినట్లు చెప్పారు. ఈ నెల 24న ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం, 30న రాత్రి 7గంటలకు అభినయ ఆర్ట్స్ ఆధ్వర్వర్యంలో ''ఇంద్రప్రస్థం'' సామాజిక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పూర్వాధ్యక్షులు ఆర్.సత్యనాథం, ఎస్.బుచ్చయ్య, కేజీ కృష్ణారావు, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఏవీ ప్రకాశరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి రోణంకి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రసాదరావు, ఎస్.రామ్మోహనరావు, జి.విజయలక్ష్మి, పి.శ్రీనివాసరావు, ఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా

మద్రిపాలెం : స్థానిక మాధవధారలో గల ఈస్ట్ పార్కులోని ఏజీజే అబ్దుల్‌కలాం కళావేదికలో పూరాంచల్ కీర్తన భజన్ మండలి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ చాలీసా భజన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈస్ట్‌పార్కు అధ్యక్షుడు బి.మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు.

క్లుప్తంగా

అయ్యప్ప సేవాపీఠంలో అన్నసమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న మాలధారులు

సీతంపేట : శబరిమలలో అయ్యప్ప స్వామి ఆలయం తెరవడంతో మండల యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా సీతంపేట గణేష్‌నగర్‌లోని అయ్యప్ప స్వామి సేవా పీఠం గురుస్వామి పి.గిరి ఆధ్వర్యంలో శనివారం అంబలం పూజ, పంచామృతాభిషేకం, పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావు, అమ్మాజి, ఇసరపు అప్పారావు, లింగమూర్తి, శివ, వేణు, కుమార్, గోపీరాజు, వెంకట్, మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా గౌరమ్మ సంబరాలు



గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేస్తున్న కర్రి రామారెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం బర్మా క్యాంప్‌లో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గౌరమ్మ 7వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి దంపతులు, స్థానికులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గౌరమ్మ అనుపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎస్.పైడిరాజు, సంఘం అధ్యక్షులు కె.శివఅప్పారావు, కార్యదర్శి ఆదారి పాపారావు, ఆడిటర్ ఆదారి ఉమామహేశ్వరరావు, కోశాధికారి పి.గోపి, పి.మోహన్, డి.జగ్గారావు, అచ్చిబాబు, మళ్ల కుమార్, కమిటీ సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం



పుష్పాలంకరణలో అయ్యప్పస్వామి

తాటిచెట్లపాలెం : పోర్ట్ హాస్పిటల్ ఎదురుగా శ్రీ లక్ష్మీ వినాయక ఆలయం ఆవరణలోని అయ్యప్ప స్వామికి మంగళ ధ్వని, వేదమంత్రాలతో అర్చకులు పుష్పాభిషేకం నిర్వహించారు. ముందుగా లక్ష్మీవినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేసి, తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్పస్వామి మాలధారులు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి.వేణుగోపాల్, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి

అలరించిన కవితా గోష్ఠి



కవిత వినిపిస్తున్న రచయిత డీవీ సూర్యారావు

సీతంపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం 'పుస్తకం, గ్రంథాలయం' అంశంపై కవితా గోష్ఠి నిర్వహించారు. ముఖ్య అతిథి యిమ్మిడిశెట్టి చక్రపాణి మాట్లాడుతూ కవితానుభూతికి హద్దులు లేవన్నారు. కవిత నేటి వాస్తవమే గాక, భవిష్యత్ వాగ్దానం కూడా అని పేర్కొన్నారు. రచయిత అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించగా, కవితా గోష్ఠిని మరడాన సుబ్బారావు సమీక్షించారు. రచయితలు, కవులు రాధారాణి, చిట్టిళ్ల నిర్మలాదేవి, భాగవతుల శాస్త్రి, దామరాజు విశాలాక్షి, పరమేశ్వరరావు, ఎం.ఆదిరెడ్డి, దేవులపల్లి పద్మజ, డి.వి.సూర్యారావు, ఎన్.శ్రీనివాసరావు, ఉప్పల అప్పలరాజు కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మేడా మస్తాన్‌రెడ్డి, సుసర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.

పూడిక తీసి... వదిలేస్తున్నారంతే..!

- దుర్వాసన భరించలేకపోతున్న స్థానికులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- వర్షాలు కురిస్తే మళ్లీ గెడ్డల్లోకే పూడిక



రామ్మూర్తిపంతుల పేటలో రహదారిపై వదిలేసిన పూడిక



రైల్వేయార్డ్‌కు వెళ్లే రహదారి గెడ్డలో తొలగించి అక్కడే వదిలేసిన వ్యర్థాలు

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, గొల్ల కంచరపాలెం ప్రాంతాల్లో గెడ్డల్లో పూడిక, వ్యర్థాలు తొలగించిన తర్వాత అక్కడే వదిలేస్తుండడంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. గెడ్డలకు ఇరువైపులా వేసి.. నీరు ఇంకిన తర్వాత వ్యర్థాలు తరలిస్తుంటారు. ఇక్కడ మాత్రం పూడిక తొలగించి నెలలు గడుస్తున్నా శానిటరీ సిబ్బంది తరలించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి వేసవిలో ప్రధాన గెడ్డల్లో జీవీఎంసీ టెండర్లతో కాంట్రాక్టర్లు పూడికలు తొలగించే కార్యక్రమం చేపట్టేవారు. ఈ ఏడాది వేసవిలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పనులు చేపట్టడానికి కుదరక వదిలేశారు. ఎట్టకేలకు గత నెలలో కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కావడంతో జోన్–5 ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ నేతృత్వంలో పూడికతీత పనులు చేపట్టారు. పూడికలు తొలగించి గెడ్డలకు ఇరువైపులా వేసి.. నెలల తరబడి వదిలేస్తుండడంతో వర్షాలు కురిసినప్పుడు చెత్త, మట్టి, వ్యర్థాలు మళ్లీ గెడ్డల్లోకి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో పశువుల సంచారంతో వ్యర్థాలు చిందరవందరగా మారుతున్నాయని.. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు ముక్కు మూసుకునే పరిస్థితి కనిపిస్తోందని వాపోతున్నారు. పూడికలు తరలించమని పబ్లిక్‌హెల్త్ సిబ్బందికి ఫిర్యాదులు చేస్తే తమకు సంబంధం లేదని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఫిర్యాదులు చేయాలని చెబుతున్నారని... ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తే కాంట్రాక్టర్లకు చెప్పాలని.. వారే తొలగిస్తారని చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్య జటిలం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.



గవర కంచరపాలెంలో పూడిక, వ్యర్థాలు

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు పెంచాలి

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.341 కోట్లు సరిపోవని, వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్ అంబేడ్కర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేస్తూ బడ్జెట్‌కు రూ.17 వేల కోట్లు కలిపి రూ.25 వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు ఇప్పటికే అమలు చేస్తున్న ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచి ఆ బడ్జెట్‌ను రూ.450 కోట్లుగా మార్చాలని కోరారు. పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, చంద్రన్న పెళ్లి కానుక, భూమి కొనుగోలు వంటి పథకాలకు మరో రూ.2,600 కోట్లు, శిథిలమైన హాస్టల్ భవనాల నిర్మాణం కోసం రూ.6 వేల కోట్లు, మెస్‌చార్జీలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం మరో రూ.1,500 కోట్లు కేటాయించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖకు సబ్ ప్లాన్ కింద రూ.34,228 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణకు రూ.4వేల కోట్లు, సాధారణ సంక్షేమ నిధికి మరో వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. సుమారు 10 సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సోడదాసి సుధాకర్, ఎన్.రాజు, పట్టా రమేష్, వేణుగోపాల్, గొల్లమాల అప్పారావు, కె.చిన్నారావు, రాజేంద్రప్రసాద్, ఎం.కోటి, మంగవేణి, ఓంకార్, నిర్మల, వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు

గంజాయితో ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరి నుంచి కేజీ వంద గ్రాముల గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీతంపేట రెల్లివీధికి చెందిన సొండి అరవింద్ (22), కనకమ్మ వీధికి చెందిన నవీన్ కలిసి సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్ దరి బిలాల్‌కాలనీలో గంజాయి విక్రయిస్తునట్టు సమాచారం అందుకున్న ద్వారకా స్టేషన్ ఎస్ఐ జె.ధర్మేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులలో అరవింద్‌పై మూడు, నవీన్‌పై ఆరు కేసులు గతంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ జె.ధర్మేంద్ర దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.


సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.17.98 లక్షలు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 28 రోజులకు గానూ రూ.17.98 లక్షల నగదు, బంగారం 3 గ్రాముల 027 మిల్లీగ్రాములు, వెండి 0.101-100 మిల్లీ గ్రాములు, అమెరికా డాలర్లు 20, యూఏఈ దిర్హమ్‌లు 10, ఎస్‌బీఐ చెక్కులు 111 లభించాయని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. శివజ్యోతి, సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, దేవదాయశాఖ తనిఖీదారుడు ఎం.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పింఛన్‌దారులు

సీతమ్మధార: కార్మికులంతా వ్యతిరేకిస్తున్నా సరే కేంద్ర ప్రభుత్వం శనివారం ఈపీఎస్–95 పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టడాన్ని పలువురు వక్తలు తప్పుపట్టారు. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ పార్కులో పింఛన్‌దారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులకు ఆప్షన్ కూడా ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని గుర్తుచేశారు. దీంతో ప్రతి పదేళ్లకోసారి సమీక్షించి మెరుగులు దిద్దుతామని కేంద్రం కోర్టుకు హామీ ఇవ్వగా.. కోర్టు కూడా కేంద్రానికి అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. పదేళ్ల తరువాత రివ్యూ పేరిట 1/3 వంతు పింఛన్ అమ్ముకునే హక్కు, భర్త చనిపోతే భార్యకు బీమా కల్పించే హక్కును తొలగించి కేంద్రం కార్మికులకు ద్రోహం చేసిందని వాపోయారు. గత ఎన్నికల ముందు బీజేపీ అధికారంలోకి వస్తే కనీస పింఛన్ రూ.9 వేలతోపాటుగా డీఏ అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీ కూటమి వచ్చి పదేళ్లు దాటినా.. కనీస పింఛన్ పెరగలేదన్నారు. ఈపీఎస్ స్కీమ్ 95 ప్రవేశపెట్టిన రోజును విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. సంఘ నాయకులు యు.వి.ఎస్.ఎన్.వర్మ, కె.దీనబంధు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, అధిక సంఖ్యలో పింఛనర్లు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి



పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పోర్టు యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని, సొంత నిధులతో అభివృద్ధి చేసి నిర్వహించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 47వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పోర్టులో వచ్చిన లాభాలతో గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని నిర్మించారన్నారు. ఇందులో కార్మికుల శ్రమదానం ఉందన్నారు. ఈ హాస్పిటల్ నడిపేందుకు 100 సంవత్సరాలకు సరిపడా రిజర్వు నిధులు పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ప్రైవేట్‌కి అప్పజెప్పాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని తెలిపారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ కోసం నాలుగేళ్లు పోరాడి కాపాడుకున్నామని, గతంలో డీసీఐ కోసం కూడా పోరాడి కాపాడుకున్నామని ఆయన గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో పోర్టు హాస్పిటల్‌ను కూడా కాపాడుకుంటామని తెలిపారు. జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, కె.ఎస్.కుమార్, శంకర్రావు, నాయుడు, శ్రీను, గణేష్, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శబరిగిరీశుని శరణుఘోష



నక్కవానిపాలెంలో అంబలం పూజలో అయ్యప్ప, భవానీ మాలధారులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఇక్కడి మెయిన్‌రోడ్డులో బోర రవికుమార్‌రెడ్డి, కోనా గోవిందరావు ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు అంబలం పూజ చేశారు. ఈ సందర్భంగా 1200 నెమలి పింఛాలతో అయ్యప్పస్వామి వెనుక చేసిన అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. శబరిమల మాదిరిగానే 18 మెట్లు ఏర్పాటు చేశారు. గురుస్వామి ఉన్ని కృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు భక్తి గీతాలతో అలరించారు. కార్యక్రమంలో వసంత లక్ష్మీనారాయణ, డీవీఎస్ ప్రసాదరెడ్డి, శ్రీనివాసవర్మ, సుమారు 700 మంది మాలధారులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రి కార్మికుల మహాధర్నా

- విధుల్లోకి తీసుకోవాలని వంటావార్పు



వంటావార్పులో ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి కార్మికులు

సీతమ్మధార: ఎంజీఎం–సెవెన్‌హిల్స్ ఆస్పత్రి యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా కార్మికులు శనివారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద 24 గంటల మహాధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేస్తోందన్నారు. హాస్పిటల్ ఆర్థిక సంక్షోభంలో ఉందని, అందుకే కార్మికులను తొలగిస్తున్నామని యాజమాన్యం కుంటిసాకు చెప్పి నిర్బంధంలో ఉంచి నోటీసులు మీద హెచ్‌ఆర్ అధికారి సంతకాలు చేయించడం చట్ట విరుద్ధమన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్ కార్మికులను కొనసాగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎంజీఎం సెవెన్‌హిల్స్ యాజమాన్యం నోటీసులు వెనక్కి తీసుకోకపోతే సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. 15 రోజుల బకాయి జీతాలు పెనాల్టీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం సుబ్బారావు, కె.చంద్రశేఖరం, నూకరాజు, లావణ్య, రమణమ్మ వెంకటరావు, నాయుడు, పుష్ప, ఎస్.రవణమ్మ, సిహెచ్.ధనలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com